క్లుప్తంగా

వాలీబాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర భవనం ఆవరణంలో ఆదివారం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికున్నారు. ఎన్నికల పరిశీలకులుగా తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు హనీఫ్, చిన్న వీరయ్య, జిల్లా డీవైఎస్‌ఓ నుంచి అమర్ స్పోర్ట్స్ హాజరయ్యారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా వంకేశ్వరం నిరంజన్, ఉపాధ్యక్షుడిగా ఉరుకొండ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, సహాయ కార్యదర్శిగా వీరప్ప, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, కోశాధికారిగా సత్యనారాయణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ ఇన్‌చార్జ్ సామరమేష్, పీఈటీ రవికుమార్, రాజన్‌గౌడ్, కృష్ణ, మాజీ కౌన్సిలర్ అలురి నరేందర్, క్రీడాకారులు శ్రీశైలం, ఆనంద్, గణేష్ పాల్గొన్నారు.

‘సమాచార’ బోర్డులు ఏర్పాటు చేయాలి

అచ్చంపేట రూరల్: ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద సమాచార హక్కుచట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం అచ్చంపేటలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమాచారం అడిగితే బాధ్యతాయుతంగా అధికారులు సమాచారం అందించాలని కోరారు. అనంతరం కొల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా బోయ మహేష్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అజీమ్, రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, కోశాధికారి ఆనంద్, కార్యవర్గ సభ్యులు మొయినుద్దీన్, ప్రకాష్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుతాం



అచ్చంపేట రూరల్: రానున్న స్థానిక, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటుదామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మోక్తాల రేణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఏడో వార్డులో పట్టణ శాఖ ఆధ్వర్యంలో బీజేపీ జెండాదిమ్మెను ఏర్పాటు చేశారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. గండు శ్రీనివాస్‌గౌడ్, గారు, శ్రీనునాయక్, అమర్, చందులాల్, తేజస్విని, శివచంద్ర, లక్ష్మణ్, భాస్కర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పైపులైన్ పనులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ల పనులు కొనసాగుతున్నాయి. రెండు రోజుల నుంచి బస్టాండ్ కూడలిలో పైపులైన్ పనులు చేపట్టడంతో పది గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరాను నిలిపివేశారు. సోమవారం సాయంత్రం వరకు పనులు కొనసాగే అవకాశం ఉందని ప్రజలు సహకరించాలని మిషన్ భగీరథ అధికారులు కోరారు. దీంతో పెద్దకొత్తపల్లి, దేవునితిరుమలాపూర్, బావాయిపల్లి, తీగలపల్లి, అదిరాల, చంద్రకల్, ముష్టిపల్లి, మరికల్ గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవత పండుగ

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవునితిరుమలాపూర్‌లో ఆదివారం మైసమ్మ దేవత పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు డప్పు మేళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మైసమ్మ దేవతకు కోళ్లను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వ్యవసాయ పొలాల వద్ద విందు భోజనాలను ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యం, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

కేసీఆర్, మర్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

తెలకపల్లి: మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలో చిన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.3.20 కోట్లు విడుదల బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో బ్రిడ్జి నిర్మాణాలు లేక ప్రజలు అవస్థలు పడ్డారు. కాని నడిగడ్డ చిన్నవాగుపై వంతెన నిర్మించడంతో రామగిరి, నడిగడ్డ ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు కొనసాగిస్తున్నారు. దీంతో ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.



ప్రమాదకరంగా కల్వర్టులు

- వాహనదారులకు తప్పనితిప్పలు
- పట్టించుకోని అధికారులు



తాడూరు- ఎండబెట్ల మధ్యలో రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు (ఫైల్)



తాడూరు సమీపంలో కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద(ఫైల్)

తాడూరు: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులపై నిర్మించిన కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు రాకపోకలు చేసేందుకు భయాందోళనకు గురవుతున్నారు. కల్వర్టులు శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. లోలెవెల్ కల్వర్టు దగ్గర సీసీ ఏర్పాటు చేశారు. కాని రక్షణ గోడలు నిర్మిడంలో నిర్లక్ష్యం వహించారు. అవసరమై చోట కాజ్‌వే బ్రిడ్జిలు నిర్మించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మండలంలో ఇలా..

మండలంలోని యాదిరెడ్డిపల్లి నుంచి అంతారం ఎటిదార్‌పల్లి మీదుగా ఐతోలు వెళ్లే రోడ్డు అనేక మలుపులు తిరిగి ఉండడంతోపాటు యాదిరెడ్డిపల్లి సమీపంలో లోలెవెల్ కల్వర్టు దగ్గర వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కొన్ని రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా అంతారం సమీపంలో వర్షపునీటితోపాటు పక్కనే ఉన్న చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో కొన్ని రోజులు రాకపోకలు నిలిపివేశారు. ఐతోలు సిర్సవాడ ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు ఐతోలు సమీపంలో లోలెవెల్ కల్వర్టు వరద తాకిడికి ఆర్టీసీ బస్సులు గ్రామాల వైపు రాలేదు. నాగద్‌పల్లి అకునెల్లికుదురు రోడ్డు మధ్యన ఉన్న కల్వర్టు దగ్గర గతేడాది పెంటయ్య గల్లంతు అయ్యాడు.

రక్షణ చర్యలు తీసుకోవాలి



మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్డుపై ఉన్న లోలెవెల్ కల్వర్టులను అధికారులు పరిశీలించారు. ప్రమాదాల బారీన పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఐతోలు దగ్గర ఉన్న కల్వర్టు సమీపంలో గతంలో వాగులో కొట్టుకుపోతున్న కుటుంబాన్ని గ్రామస్తులు కాపాడారు. కల్వర్టులపై అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి.

– కురుమూర్తి యాదిరెడ్డిపల్లి

ప్రతిపాదనలు పంపించాం

లింక్‌రోడ్లపై ఉన్న కల్వర్టులు నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపించాం. అకునెల్లికుదురు, అంతారం సమీపంలో ఉన్న కల్వర్టుల నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయి. త్వరలో నిర్మాణ పనులు చేపడుతాం. భవిష్యత్‌లో సమస్య రాకుండా చర్యలు తీసుకుంటాం. వచ్చే ఏడాదినాటికి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమే. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాం.

– శివకృష్ణ, ఏఈ, తాడూరు

సీపీఐ నేతకు ఘన నివాళి

కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి ఆదివారం ఆ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. పార్టీ కోసం, పేదల ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషిని వారు కొనియాడారు. ఇందిర, దామోదర్, కృష్ణ, లక్ష్మీ తదితరులున్నారు.

సురవరం ఆశయాలను కొనసాగిస్తాం

చారకొండ: సీపీఐ దిగ్గజనేత సురవరం సుధాకర్‌రెడ్డి అశయాలను కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చిల్వేరు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఐ అనుబంధ సంస్థలో పని చేస్తు ఎన్నో పోరాటాలు చేసి పార్టీ అగ్రనేతగా ఎదిగి పేదల పక్షాన పోరాటం చేశారని గుర్తు చేసుశారు. ఆయన మరణం తీవ్ర దిగ్భాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. నాయకులు నారాయణ్ రెడ్డి, బాలయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.



లింగాలలో నివాళులర్పిస్తున్న నాయకులు

పార్టీకి తీరనిలోటు

లింగాల: సీపీఐ అగ్రనేత మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ శ్రేణులు, అభిమానులు ఘన నివాళులర్పించారు. ఏకలవ్య కూడలిలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మరణం పార్టీకి, బడుగు బలహీన వర్గాల వారికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. పెరుమళ్ల గోపాల్, నాయకులు చెన్నదాస్, శ్రీనివాసులు, పార్వతమ్మ, తగిలి బాలస్వామి పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం



మన్ననూర్: స్థానిక అంబేడ్కర్, ఉమామహేశ్వర కాలనీలలోని కుటుంబాలు ఆదివారం ఘనంగా వన మహోత్సవం నిర్వహించారు. బ్యాండు మేళాల మధ్య మహిళలు అలంకరించిన గంపలను తలపై పెట్టుకుని పిల్లాపాపలతో గ్రామ శివారులోకి వెళ్లి వన ప్రవేశం చేశారు. వన దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడే సహపంక్తి వన భోజనాలు చేశారు.

హాజరైన మంత్రి సీతక్క

‘ఊరూర పనుల జాతర’లో భాగంగా అమ్రాబాద్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనల కోసం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి వెళ్తున్న మంత్రి సీతక్క దారిలో పురుగుల గుట్ట వద్ద వన మహోత్సవంలో ఉన్న మహిళలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పంబలి బుచ్చయ్య, రహీం, సత్యనారాయణ, శ్రీనివాసులు, రెహమాన్, తిరుపతి, యశ్వంత్, కర్ణయ్య తదితరులు మంత్రి సీతక్కకు ఘన స్వాగతం పలికారు.

జిల్లా అధ్యక్షుడిగా ఖాసిం యాదవ్

నాగర్‌కర్నూల్ రూరల్: తెన్యాయ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ చట్టం సాధన, సామాజిక సమస్యల పరిష్కారం కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా ఏర్పాటైన లీగల్ ఫోరం ఫర్ తెలంగాణ న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడిగా ఖాసిం యాదవ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా బాధ్యతలు అప్పగించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. న్యాయ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానని ఆయన తెలిపారు.

రూ.61 వేలు ఆర్థికసాయం

లింగాల: మండలంలోని మల్లొనిచెర్వుతండాకు చెందిన కాట్రావత్ కిషన్‌నాయక్ కొన్ని రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.61 వేల ఆర్థిక సాయం అందజేశారు.

రాష్ట్ర సమితి సభ్యుడిగా కేశవులుగౌడ్

తెలకపల్లి: సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా రెండోసారి కే. కేశవులుగౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల సీపీఐ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

రైతులను ఆదుకోవాలి



తెలకపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. ఆదివారం కారువంగ పత్తి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. అధికారులు పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, మండల నాయకులు లక్ష్మణ్, కాశన్నలు, కృష్ణయ్యలు ఉన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



అచ్చంపేట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారి గుండా శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. అంతకుముందు భక్తులు పూజలు చేసి ముగింపు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సాయిశంకర్, మనోహర్, వరుణ్, రాధాకృష్ణ, శశిప్రీతం, మల్లికార్జున్, రామ్మోహన్‌రెడ్డి, రవి, నవీందర్, సురేష్, ఆత్మరామ్, రమాదేవి, స్వప్న, ప్రసన్న, సుష్మ, శిరీష పాల్గొన్నారు.

సెన్సార్ ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు

కందనూలు: నాగర్‌కర్నూల్ మండలం బొందలపల్లిలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం గ్రామానికి చెందిన బండారు ఆనంద్ తన సొంత ఖర్చులతో సెన్సార్ నాలుగు ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. దాత బండారు ఆనంద్‌ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, బాలనాగయ్య, తిరుపతి రెడ్డి, లోకేష్ రెడ్డి, మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు, బస్సు ఢీ: గాయాలు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్ గ్రామానికి 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న నిరంజన్‌షావలీ దర్గా వద్ద కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం శ్రీశైలం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అచ్చంపేట డిపో నుంచి పదరకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు ఎయిర్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు పాక్షికంగా దెబ్బతింది. గంట సేపు ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడింది. అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని పోలీసులు తెలిపారు.


కుక్కల దాడిలో నాలుగు పశువులు మృత్యువాత

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో ఆదివారం కుక్కల దాడిలో నాలుగు పశువులు మృత్యువాత పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వ్యవసాయ పొలంలో కట్టేసి ఉంచిన సామ చెన్నయ్యకు చెందిన రెండు ఆవులు, సామ చంద్రయ్యకు చెందిన ఒక ఎద్దు, మాడుగుల శ్రీనివాసులుకు చెందిన ఎద్దుపై కుక్కలు దాడి చేశాయి. ఆ దాడిలో నాలుగు పశువులు మృత్యువాత పడ్డాయని బాధిత రైతులు తెలిపారు. పశువుల విలువ రూ. 4 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

అండగా ఉంటాం

వంగూరు: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షరీఫ్‌ఖాన్ అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం సంతాపసభ నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్వాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయం చైర్మన్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో వెల్దండ జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

వెల్దంద: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1996–97 సంవత్సరం లోని పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆకృతి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులకు పాదపూజ చేసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని జిల్లా ప్రాథమికోన్నత పాఠశాలలో 1989–90 వ సంవత్సరంలో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 35 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తాం



శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి: నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని సాతాపూర్‌లో రూ.3.38 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు, గృహ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించే లక్ష్యంతోనే గ్రామాల్లో విద్యుత్ ఉప కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలల్లో విడతలు వారీగా అమలు చేస్తుందన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ బుడుగు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బాలస్వామి, రైతు సమితి మాజీ మండల అధ్యక్షులు లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు,మహిళలు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనాలు నిర్వహిద్దాం



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ చాలక్

కొల్లాపూర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతి గ్రామంలో హిందూ సమ్మేళనాలు నిర్వహించాలని జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ లక్ష్మీకాంత్ సంఘం సభ్యులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని మాధవస్వామి గుడి ప్రాంగణంలో ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. దసరా వేడుకల సందర్భంగా ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకొని హిందూ సమ్మేళనాలు ఏర్పాటు చేయాలని కోరారు. వ్యక్తి శీలత, నిర్మాణానికి సంఘం ప్రాధాన్యం ఇస్తుందని వివరించారు. హిందువులను సంఘటితం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ పర్యావరణ ప్రముఖ్ బృంగి కృష్ణప్రసాద్, ఖండ కార్యవాహ మేకల విజయ్‌యాదవ్, ద్విఖండ ప్రచారక్ ప్రకాష్ తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు గ్రామ గ్రామాన జరపాలని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంఘ్ చాలక్ ఎమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో హిందూ సంఘటిత కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో చంద్రశేఖర్ శివానంద్, రవి, మల్లేష్, తిరుపతయ్య, ఉమాపతిచార్యులు, శివకృష్ణ, వెంకటాచారి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రుల పరామర్శ

ఉప్పునుంతల: సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన వెల్దండ జైపాల్‌రెడ్డి తండ్రి వెల్దండ రామచంద్రారెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం మంత్రులు సీతక్క, వాకిటి శ్రీహరి జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను వేర్వేరుగా పరామర్శించారు. రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. మంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, స్థానిక నాయకులు అనంతరెడ్డి, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో ఇక్కట్లు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ట్రాఫిక్ సమస్యతో మైసమ్మ జాతరకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారి పనులు కొనసాగుతుండటంతో ఒకే వైపు నుంచి వాహనాలు రాకపోకలు కొనసాగించడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. గంటల తరబడి రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు. భక్తులు పోలీస్ స్టేషన్ నుంచి వెనుక భాగం ఉండే రోడ్డుపై నుంచి వెళ్తే ట్రాఫిక్ సమస్య ఉండేది కాదు. బస్టాండ్ కూడలిలో కోళ్లు, తినుబండరాలు, పూజా సామాగ్రి కొనుగోలు కోసం వచ్చినవారు వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలుపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కొల్లాపూర్ నుంచి వచ్చే వారు సాతాపూర్ మీదుగా నాగర్‌కర్నూల్ నుంచి వచ్చే భక్తులు ముష్టిపల్లి రోడ్డుపై వెళ్లాలని పలువురు పేర్కొంటున్నారు. ప్రతి ఆదివారం సాతాపూర్ వద్ద ముష్టిపల్లి వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి మైసమ్మ జాతరకు వెళ్లే వాహనాలను రూట్ మళ్లిస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని భక్తులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి

తాడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద రావడంతో కల్వర్టులు దగ్గర రాకపోకలకు అనేక అవస్థలు పడ్డారు. తాడూరు గగ్గలపల్లి మధ్యన కల్వర్టు దగ్గర వరద ప్రవహించడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోజుల తరబడి ప్రయాణాలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ప్రమాదకరమైన కల్వర్టులు గుర్తించి కాజ్‌వే బ్రిడ్జిల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేసి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో

అచ్చంపేట రూరల్: పట్టణంలో రోజురోజుకు సమస్యలు పేరుకుపోవడంతో ఆదివారం బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిచిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోతే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు రేణయ్య, శ్రీనునాయక్, శ్రీనివాస్‌గౌడ్, తేజస్విని, రవీందర్, అలీం, రాజు, చందులాల్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం




కందనూలు: జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర జానపదుల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ జానపద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జానపద కళాకారులు సాంస్కృతిక కళానృత్యాలు ప్రదర్శించారు. వివిధ జానపద రూపాలతో విద్యార్థులు, యువకులు ఆట, పాటలతో నృత్యప్రదర్శన చేశారు. కార్యక్రమంలో జిల్లా జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, జిల్లాలోని కళాకారులు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానాన్ని మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యార్థుల క్రీడల కోసం స్టేడియాన్ని మంజూరు చేశారని దీనికి అనుగుణంగానే అనువైన స్థలాన్ని పరిశీలించి మంత్రికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వరావు, మాజీ సర్పంచ్‌లు పగిడాల చిన్నయ్య, డాక్టర్ కురుమూర్తి, బాలస్వామి, రామ్‌లాల్, మాజీ ఎంపీటీసీలు రవికుమార్, ధర్మేందర్, భీరం సుదర్శన్, రాములు, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల కోసం పోలీసుల మోహరింపు



సార్లపల్లిలో మోహరించిన పోలీసులు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి అంబేడ్కర్ కూడలిలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించిన కేసులు లేకుండా శాంతియుతంగా పరిష్కరించేందుకే పోలీసు బలగాలు సార్లపల్లి గ్రామానికి వెళ్లినట్లు అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్, ఎస్ఐ గిరి మనోహర్‌రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం ఆదివాసీలకు సంబంధించిన ఓ వాట్సప్ గ్రూప్‌లో శనివారం ఆదివాసి హక్కులు, కొందరు ఆదివాసీలు అన్యమతాన్ని స్వీకరించడం, ఆదివాసి సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తీవ్రమైన చర్చ జరిగింది. అదే రోజు సాయంత్రం సార్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చిగుర్ల మల్లికార్జున్ మన్ననూర్ గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో అంబేడ్కర్ కూడలిలో మల్లికార్జున్‌కు మన్ననూర్ గ్రామానికి చెందిన చెంచు యువకులు రాజేంద్రప్రసాద్, శంకరయ్య, మురళీధర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేంత వరకు వెళ్లింది. దాడి విషయం పెట్రాల్ చేస్, సార్లపలి గ్రామంలోని మల్లికార్జున్ వర్గీయులకు తెలిసింది. దీంతో ఆ గ్రామాలకు చెందిన 50–60 మంది చెంచులు మన్ననూర్ గ్రామానికి చేరుకొని ప్రతి దాడి కోసం ప్రయత్నించారు. లింగమయ్య కాలనీలో మురళీధర్ అనే వ్యక్తిపై దాడి చేశారు. అనంతరం ఇరువర్గాలు కూడా పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా పోలీసులు మల్లికార్జున్‌ను ఆధీనంలోకి తీసుకుని రహస్యంగా ఉంచారని కొందరు చెంచులు ఆరోపిస్తూ అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆదివారం పోలీసు బలగాలు సార్లపల్లి గ్రామానికి వెళ్లి మహిళలతో పాటూ కొందరు యువకులను అదుపులోకి తీసుకొని డీసీఎం వాహనంలో అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.